
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
బుధవారం 29 జనవరి 2025





భీమునిమల్లారెడ్డిపేటలో రెండంతస్తుల రామాలయం

మాఘమాసం జాతరొచ్చింది..

● సిరిసిల్ల మానేరు, మూలవాగు తీరాల్లో సంబరాలు

● జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన ఆలయాలు..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల మానేరు, మూలవాగు తీరాల్లో జాతర సందడి మొదలైంది. మాఘ అమావాస్య రోజున జాతర సంబురాల్లో జిల్లా ప్రజలు ఉత్సాహంగా పాల్గొననున్నారు. ఆదివారం సిరిసిల్ల మానేరు వాగులో గంగాభవాని జాతరతోపాటు మడేలేశ్వర స్వామి, రామప్ప రామలింగేశ్వరస్వామి జాతరలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొడుముంజ సమీపాన చారిత్రాత్మక క్షేత్రమైన శ్రీరామేశ్వరాలయం ఉంది. ప్రాచీన ఆలయమైన రామప్ప శిల్పసౌందర్యంతో అందరిని అకట్టుకునేది. మిడ్‌మానేరు ప్రాజెక్ట్ నిర్మాణంతో దేవాలయం ముంపునకు గురైంది. నాయీబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో జరిగే శ్రీరామప్ప రామలింగేశ్వస్వామి కల్యాణం జాతరను సిరిసిల్ల కరకట్ట వద్ద దేవాలయం పునర్‌నిర్మాణం జరుగుతున్న స్థలంలో జరపడానికి ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు సిరిసిల్ల మానేరు నదిలో గంగాభవాని దేవా లయం వద్ద పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తారు. గంగా భవానికి ఘనంగా మహిళలు ఒడిబియ్యం సమర్పించుకుంటారు. మాఘమాసం రోజున తెల్లవార్లు జరిగే ఈ జాతరకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. మానేరు ఒడ్డున రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వర స్వామి దేవాలయంలో జాతర మహోత్సవంతో పాటు కల్యాణాలు నిర్వహించనున్నారు.

జాతరకు ముస్తాబైన శ్రీలక్ష్మీకేశవ ఆలయం..

ఎల్లారెడ్డిపేట, : మండల కేంద్రం శివారులోని శ్రీలక్ష్మీకేశవ పెరుమాండ్ల ఆంజనేయ స్వామి ఆలయాన్ని మాఘ అమావాస్య జాతరకు ముస్తాబు చేశారు. మండలంలోని అక్కపల్లి గ్రామ శివారులోగల బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం జాతర ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మహిమగల దేవుడిని భక్తిశ్రద్ధలతో కొలిచేందుకు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, సిరిసిల్ల, కోనరావుపేట, ముస్తాబాద్ తదితర మండలాల నుంచి భక్తులు తరలి రానున్నారు.



మామిడిపల్లి శ్రీసీతారామస్వామి ఆలయం

భక్తులకు కొంగుబంగారం సీతారామస్వామి

కోనరావుపేట : మామిడిపల్లి శ్రీసీతారాముల స్వామి భక్తుల కొంగుబంగారంగా కొలుస్తారు. ఈ ఆలయం వేములవాడ శ్రీరాజ రాజేశ్వరస్వామి అనుబంధ ఆలయంగా కొనసాగుతోంది. అరణ్యవాసంలో భాగంగా శ్రీసీతారామచంద్ర స్వామి ఈ గుట్టపైన సేదతీ రాడని, రాముడి పాదముద్రలు ఇప్పటికీ కనిపిస్తాయి. అంతే కాకుండా ఈ గుట్టపైన మునులు తపస్సు చేయడం వల్ల అప్పుడు మునిపల్లెగా ఉన్న గ్రామం రానురాను మామిడిపల్లిగా ప్రసిద్ధి గాంచింది. ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య సందర్భంగా లక్షలాది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించు కుంటారు. చుట్టుపక్కల గ్రామాల రైతులు ఎడ్ల బండ్లతో వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. జాతర సందర్భంగా విగ్రహాలను, గుండ్ల పైన చిత్రాలను వేసి ఆధ్యాత్మికతను పెంపొందించే విధంగా సీతారాముల గుట్ట ప్రాంతాన్ని తీర్చిదిద్దారు. గుట్ట ప్రాంతాన్ని రాముని పాదముద్రలు, శంకు తీర్థం, ఆంజనేయ విగ్రహం, సీతమ్మ తల్లి విగ్రహంతో పాటు భక్తులను ఆకట్టుకునే చిత్రాలతో తీర్చిది ద్దారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

చిరువ్యాపారుల కోలాహలం..

మాఘమాస జాతరల వద్ద చిరు వ్యాపారుల కోలాహలం జాతర శోభను మరింత పెంచుతుంది. వివిధ ప్రాంతాలనుంచి బొమ్మలు, ఇతర వస్తువులు అమ్మకాల కోసం ప్రత్యేక దుకాణాలను ఏర్పాటుచేసుకున్నారు. సిరిసిల్ల మానేరు వాగులో ఒక రోజు ముందు నుంచే అమ్మకాలు ప్రారం భించారు. ఏటు చూసినా సందడి వాతావరణం కనిపిస్తోంది.

పెద్దలింగాపూర్ రామలింగేశ్వర స్వామి జాతర

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో జాతర జరుగనుంది. ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య సందర్భంగా ఆలయంలో జాతర కొనసాగుతుంది. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం ఆలయం చుట్టు బండ్ల ప్రదక్షిణలు జరుగనున్నాయి. ఆలయానికి ...

మిగతా 8లో

రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణానికి రూ.51 కోట్ల 65 లక్షలు..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ 15కోట్ల 65 లక్షల రూపాయలు మంజూరు చేసిందని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క చొరవతో ఎంఆర్‌ఆర్ గ్రాంట్ కింద రోడ్ల మరమ్మతులకు, బ్రిడ్జిల నిర్మాణానికి ఈ నిధులు విడుదల చేశారని తెలిపారు. వేములవాడ పట్టణ పరిధిలోనీ లక్ష్మిపూర్-అయ్యోరుపల్లి మధ్య రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయలు, వేములవాడ రూరల్ మండలంలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి చెక్కపల్లి రోడ్డుకు రూ.40లక్షలు, నమిలిగుండుపల్లి నుంచి వడ్డెరకాలనీ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షలు, మామిడిపల్లి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బొల్లారం వాటర్ ట్యాంక్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.కోటి5లక్షల నిధులు, వేములవాడ అర్బన్ మండలంలో చంద్రగిరి రోడ్డుకు కోటి 20 లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. వేములవాడ కమాన్‌నుంచి పల్లిమక్త, నాగారం మీదుగా మర్తనపేట వరకు రోడ్డు నిర్మాణానికి కోటి 50లక్షలు, చందుర్తి మండలం మర్రిగడ్డ నుంచి ఎనగల్ రోడ్డు మరమ్మతుకు కోటి 50 లక్షలు, మూడపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నర్సింగాపూర్ ఎస్సీ కాలనీ రోడ్డు నిర్మాణానికి వరకు కోటి 20లక్షలు, మేడిపల్లి మండలం కొండాపూర్ ఓడ్యాడు గ్రామాల మధ్య రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి 7 కోట్లు మంజూరైనట్లు వివరించారు. రోడ్ల, బ్రిడ్జిల నిర్మాణం కోసం సుదీర్ఘకాలంగా నిధుల మంజూరు కోసం వేచిచూస్తుండగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి సీతక్క చొరవతో నిధులు మంజూరయ్యాయని ఆది శ్రీనివాస్ తెలిపారు.

లేబర్ అడ్డాలకు స్థలాల గుర్తింపు..

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

సిరిసిల్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల, వేములవాడలో దినసరి కూలీల కోసం లేబర్ అడ్డాలకు స్థలాలను గుర్తించామని, అనుమతులు రావడంతోనే పనులు ప్రారంభిస్తామని రాజన్న సిరిసిల్ల కార్మిక సహాయ కార్మిక అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో దినసరి కష్టాల శీర్షికన భవన నిర్మాణ కార్మికులు పడుతున్న ఇబ్బందులపై కథనం అందించారు. దీనిపై వివరణ ఇస్తూ జిల్లాలో ఇప్పటివరకు 63340 మంది భవన నిర్మాణ కార్మికులు నమోదు చేసుకున్నారని తెలిపారు. సిరిసిల్ల, వేములవాడలో రెండు ఫెసిలిటేషన్ కేంద్రాల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు.

కరాటే శిక్షకులు దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇవ్వడానికి అర్హులైన శిక్షకులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి అజ్మీరా రాందాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులకు (బాలికలు)ఆత్మరక్షణ విద్య కరాటేలో శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షా ప్రశిక్షణ్ పథకాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. జిల్లాలో అదనంగా గుర్తించిన 12ప్రభుత్వం పాఠశాల్లో శిక్షణ ఇచ్చేందుకు 12మంది కరాటే శిక్షకులను నియమించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అర్హులు కరాటేలో బ్లాక్ బెల్టు కలిగి ఉండి కనీసం రెండు సంవత్సరాలు శిక్షణ అనుభవం ఉండి వయస్సు 35 నిండిన మహిళలు, పురుషులు ఈనెల 30 తేదిలోగా జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన శిక్షకులు పాఠశాలలో వారంలో మూడు రోజులు కరాటే శిక్షణ తరగతులు తీసుకోవాలని తెలిపారు. కరాటే శిక్షకులకు గౌరవ వేతనం రూ.5వేలు ఉంటుందని అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారంతో పాటు కరాటేలో బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్, రెండు సంవత్సరాలు అనుభవం ఉన్న సర్టిఫికెట్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌లను జత చేసి ఇవ్వాలని పేర్కొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుష్టు వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, లెప్రసీ నోడల్ సూపర్‌వైజర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌రజిత మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని, వ్యాధిపై ప్రజలో ఉన్న అపోహలను దూరం చేయాలన్నారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించనున్న సర్వేలో జిల్లాలోని గ్రామగ్రామాన వ్యాధి నివారణ కార్యక్రమాలను వివరిస్తూ అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించాలన్నారు. జిల్లాలోని ప్రతి హైస్కూల్, రెసిడెన్సియల్స్, హాస్టల్స్‌లో విద్యార్థులకు వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధిని ఆరంభ దశలో గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ సంపత్, వైద్యులు అనిత, శివరామకృష్ణ, డీపీ ఎమ్‌వోలు చేపూరి శ్రీనివాస్,కూన సురేష్, ఈదేవి సింగ్, డెమో రాజ్‌కుమార్, హెచ్‌ఈ బాలయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, నోడల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కన్నుల పండువగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



చీకోడ్‌లో స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ముస్తాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చీకోడ్ గ్రామంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. మాఘ అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం కల్యాణ మహోత్సవం, ఊరేగింపు సేవ, మంత్రపుష్పము, మంగళహారతి, తీర్థప్రసాదాల పంపిణీ అన్న దానం నిర్వహించారు. భక్తులు ఒడిబియ్యం, కట్నకానుకుల సమర్పించుకున్నారు. దేవేందర్, పోతిరెడ్డి రాజయ్య, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం

వేములవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో వేములవాడ పట్టణంలోని ఆర్యవైశ్య సత్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ అవసరం ఉన్నవారికి రేకుర్తిలోని కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మెన్ మారం కుమార్, వేములవాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కటకం శ్రీనివాస్, ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడు బుస్సా శ్రీనివాస్, కోశాధికారి కటకం కిషన్, అల్లాడి రమేష్, బింగి మహేష్, నిమ్మశెట్టి విజయ్, నగుబోతు రవీందర్, కట్కూరి శ్రీనివాస్, డాక్టర్ ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితుడికి ప్రభుత్వ విప్ చేయూత

కోనరావుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గల్ఫ్ బాధితుడు కష్టాలు పడుతున్న వీడియోను చూసి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన మెరుగు అంజి గత సంవత్సరం మోటర్ డ్రైవింగ్ పనిపై గల్ఫ్ దేశమైన సౌదీకి వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న కంపెనీ యజమాన్యం జీతాలు ఇవ్వ కుండా వీసా పాస్‌పోర్టు తీసుకుని ఇండియాకు రాకుండా ఇబ్బందులు పెడు తున్నారని బాధితుడు వీడియో పంపాడు. దీనికి స్పందించిన ఆది శ్రీనివాస్ అక్కడి అధికారులతో మాట్లాడి అతడిని రప్పించేందుకు ఏర్పాట్లుచేశారు.ఈనెల 27న సౌదీ నుంచి బయలుదేరి 28న హైదరాబాద్ చేరుకోనున్నారు. గల్ఫ్ బాధితుడి ఇంటికి రప్పిస్తున్న ఆది శ్రీనివాస్‌కు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు..

- దప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలు
- అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



వేములవాడలో భక్తులతో సందడిగా మారిన బద్దిపోచమ్మ ఆలయం

7

కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం..

- ప్రజాగాయకుడు గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలపై నిరసన..



మందేపల్లిలో కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

8

బ్యాంకుల వద్ద పకడ్బందీగా భద్రత..

- బ్యాంకర్లతో సమావేశంలో అదనపు ఎస్పీ డి చంద్రయ్య



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ చంద్రయ్య

సిరిసిల్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ బ్యాంక్ శాఖలు, ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చూసుకోవాలని అదనపు ఎస్పీ డి చంద్రయ్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో బ్యాంక్, ఏటీఎం భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్‌లు, ఏటీఎం కేంద్రాల వద్ద ఎటువంటి దుర్ఘటనలు జరగకుండా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏటీఎం, బ్యాంక్‌ల వద్ద నిర్దేశిత భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రతి బ్యాంక్‌లో ఎలక్ట్రానిక్ అలారం సిస్టమ్ అందుబాటులో ఉండాలని, బ్యాంక్‌లు, ఏటీఎంల వద్ద పనిచేసే సీసీ కెమెరాలు తప్పని సరిగా ఉండాలని అన్నారు. ఏటీఎం కేంద్రాల లోపల బయట కూడా సీసీ కెమెరాలు ఉండాలని అన్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద సెక్యూరిటీ గార్డు అప్రమత్తంగా ఉండాలని, చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బ్యాంక్‌కు సంబంధించిన నగదు, గోల్డ్ లాకర్స్ తాళాలు డూప్లికేట్ ఉండకుండా చూడాలని అన్నారు. బ్యాంక్ కార్యాలయంలో స్టేషనరీ, డైనింగ్‌లతో పాటు అన్నీ రకాల గదులు మూసివేసి ఉంచాలని అన్నారు. బ్యాంక్ వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రతా వ్యవహారాలు తప్ప మిగిలిన ఎలాంటి పనులు చేసేందుకు వీలు లేదన్నారు. బ్యాంక్‌లోకి ఏటువంటి ప్రమాదరక వస్తువులు, ఆయుధాలు అనుమతించవద్దని హెల్మెట్, మాస్క్ వంటివి బ్యాంకుల్లో నిషేధించాలని సూచించారు. బ్యాంక్ వద్ద ఏదైనా సమస్య ఉంటే అలారం సిస్టమ్ నుంచి నేరుగా పోలీస్ కంట్రోల్ రూంకు సమా చారం వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని తెలి పారు.

ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్, బ్యాంక్ కంట్రోలర్స్ మేనేజర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దావోస్ పర్యటన నుంచి తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. దావోస్ వేదికగా జరిగిన సదస్సులో రాష్ట్రానికి 1.78 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు ఆది శ్రీనివాస్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన విధానం, నిర్దిష్టమైన ప్రణాళిక కలిగి ఉన్న కారణంగా ప్రపంచ అగ్రశ్రేణి కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని ఆది శ్రీనివాస్ అన్నారు.

ఇదిలా ఉండగా, రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు వేములవాడ నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు.

కేటీఆర్ కనుసన్నల్లోనే చేనేత, జౌళిశాఖ అధికారులు

- చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి



సమావేశంలో మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్ల టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ప్రభుత్వం మారినా మాజీ మంత్రి కేటీఆర్ కనుసన్నలోనే చేనేత, జౌళిశాఖ అధికారులు పని చేస్తున్నారని చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో చేనేత, పవర్‌లూం కార్మిక జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలన్న సదుద్దేశంతో స్పందించారన్నారు. నాలుగు మాసాల క్రితం రాష్ట్రంలోని స్వశక్తి మహిళా సంఘాల్లోని మహిళలందరికి ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున ఇస్తామని, వాటిని సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ద్వారా ఉత్పత్తి చేయించుకుంటామని ప్రకటించారన్నారు. ప్రకటన చేసి నాలుగు మాసాలు గడుస్తున్న ప్రకటనగానే మిగిలిపోయిందన్నారు. 15 రోజుల క్రితం టెస్కో జీఎం అశోక్‌రావు కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి గతం మాదిరిగానే కార్మికులు, ఆసాములకు వేతనాలు ప్రకటించకుండనే ఆర్డర్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మళ్లీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ గతంలో మీటరుకు రూ.37ఇవ్వగా ప్రస్తుతం రూ.29.50 పైసలు ఇస్తాననడం సరైన విధానంకాదని మండిపడ్డారు. ఇందులో నుంచి ఆసామి కార్మికుని వేతనంగా రూ.9.50పైసలు ప్రకటించడం దుర్మార్గమన్నారు. గతంలో రూ.11 చెల్లించారని ఐదు సంవత్సరాల నుంచి ఆర్డర్లు ఇచ్చిన ఇదే అధికారులు అప్పుడు వేతనాలు పెంచి ఇప్పుడు వేతనాలు తగ్గించి ఇవ్వడంలో అధికారుల అంతర్యం ఏంటని ప్రశ్నించారు. చేనేత జౌళిశాఖ అధికారులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసే విధానం అవలంబిస్తున్నారని ఆరోపించారు. రోజురోజుకు మార్కెట్లో నిత్యావసర సరుకులు పెరుగుతుంటే కార్మికులు, ఆసాముల వేతనాలు తగ్గించడం శోచనీయమన్నారు. ఆసాములు కార్మికులు మహిళ శక్తి చీరలను ఉత్పత్తి చేసే పరిస్థితులు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా చేనేత జౌళిశాఖ అధికారులు గతంలో కంటే మెరుగైన వేతనాలు వచ్చేలా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వస్త్ర పరిశ్రమకు సంబంధించిన అన్ని వర్గాలను కలుపుకొని ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. చేనేత పవర్ లూం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, సీపీఐ సీనియర్ నాయకుడు నల్ల చంద్రమౌళి పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు ఆరునెలల జిల్లా బహిష్కరణ

సిరిసిల్ల క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన మహ్మద్ మోయిస్ పాషా అలియాస్ మోయిజ్(34) అనే రౌడీ షీటర్‌ను ఆరునెలల జిల్లా బహిష్కరణ చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కె.కృష్ణ తెలిపారు. మంగళవారం అతడికి బహిష్కరణ నోటీసు అందజేశామన్నారు. మోయిజ్ ఎక్కడైనా కనపడితే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు. సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 11కేసుల్లో నిందితుడిగా ఉంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజాశాంతికి, సామాన్య ప్రజలకు భంగం కలిగిస్తున్నాడని వస్తున్న ఫిర్యాదుల మేరకు అతనిపై తెలంగాణ సామాజిక వ్యతిరేక, ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఆరునెలలు జిల్లా నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. అసాంఘిక, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ధర్మపురి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గత నెలలో ఒక వ్యక్తిని చంపి కాల్చి వేసిన కేసులో మెరుగు లస్మయ్య అలియాస్ లక్ష్మణ్ అనే నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. గతంలో ఈ కేసుతో సంబంధం కలిగి ఉన్న నేరెళ్ల గోపాల్ అలియాస్ గోపాల్ రమేష్, గండికోట శేఖర్ అనే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నేరెళ్ల గ్రామానికి చెందిన మెరుగు లస్మయ్యకు సంబంధం కలిగి ఉందని నిర్ధారణ కావడంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తాండ్ర్యాల శివారులో మంగళవారం ఓ వాహనం ఢీకొన్న ఘటనలో రుద్రంగికి చెందిన నగిరి విజయ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం విజయ్ బైక్‌పై తాండ్ర్యాలకు వచ్చి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎక్స్ రోడ్డు వద్ద వెనక వైపు నుంచి మినీ ట్రక్ ఢీకొట్టింది. దీంతో విజయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూతగాదా కేసులో ఐదు సంవత్సరాల జైలు

మెట్‌పల్లి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో భూతగాదా కేసులో నిందితుడు రేగుంట చిన్న లక్ష్మయ్యకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 2 వేల జరిమానా విధిస్తూ మెట్‌పల్లి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి డి. నాగేశ్వరరావు తీర్పు వెలువరించినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వర్షకొండ గ్రామానికి చెందిన రేగుంట చిన్న లక్ష్మయ్య అదే గ్రామానికి చెందిన సల్వాల రాజేందర్ అనే వ్యక్తిపై 2017లో భూ తగాదాల నేపథ్యంలో గొడ్డలితో దాడి చేశాడు. బాధితుడి భార్య సల్వాల పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ బి.రాము నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు సాక్షులను విచారించి నిందితుడు రేగుంట చిన్న లక్ష్మయ్యకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 2 వేల జరిమానా విధించింది. కేసులో నిందితుడికి శిక్ష పడేటట్లు చేసిన ఎస్‌ఐ రామును, కోర్టు కానిస్టేబుల్ కవితను ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రాములు అభినందించారు.

విద్యుదాఘాతంతో అడవి జంతువుల మృత్యువాత

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేట శివారులో ఓ రైతు అమర్చిన విద్యుత్ తీగల కారణంగా అడవి జంతువులు మృత్యువాత పడ్డాయి. పంటలపై దాడి చేసి ధ్వంసం చేస్తుండటంతో విద్యుత్ తీగలు అమర్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధించిన నలుగురిపై కేసు

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తీసుకురావాలని వేధించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పోతారంకు చెందిన బీనవేని అరుణ్‌కు మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన నిత్యశ్రీతో రెండేళ్ల కిందట వివాహమైంది. అప్పుడు రూ.10 లక్షల వరకట్నంతో పాటు ఇతర లాంఛనాలు అందజేశారు. మళ్లీ రూ.10లక్షలు తీసుకురావాలంటూ తరచూ భర్త అరుణ్‌తో పాటు అత్త మీనమ్మ, బావ హరీశ్, తోటి కోడలు రాజ్యలక్ష్మీ వేధింపులకు గురిచేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మూడు ఆలయాల్లో దొంగతనం

తిమ్మాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిపాలెం గ్రామంలో ఒకే రోజు మూడు దేవాలయాల్లో దొంగతనాలు జరిగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని పోచమ్మ, రేణుకా ఎల్లమ్మ, పెద్దమ్మ దేవాలయాల్లో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనాలకు పాల్పడ్డట్లు తెలిపారు. పోచమ్మ గుడిలో అమ్మవారికి వేసిన బంగారు అభరణాలు, పెద్దమ్మ గుడిలో కండ్ల బంగారు పుస్తెలు, రేణుక ఎల్లమ్మ గుడిలో హుండీ పగులకొట్టి అందులో ఉన్న నగదు ఎత్తుకెల్లారు. హుండీలో ఏడాది కాలంగా భక్తులు వేసిన నగదు ఉన్నట్లు తెలిపారు. ఒకే రోజు మూడు ఆలయాల్లో దొంగతనం జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

అద్దెకు ఉన్న ఇంటికే కన్నం

● చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నమ్మి గదిని అద్దెకు ఇస్తే ఆ ఇంటికే ఓ యువకుడు కన్నం వేశాడు. మండల కేంద్రంలోని బందారపు గంగిరెడ్డి ఇంటిలో చోరీకి పాల్పడిన సంఘటనలో రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కాసోజి విజయ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. అతడి వద్ద నుంచి 5.5 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని గంగిరెడ్డి ఈ నెల 27న తన ఇంటికి గడియ వేసి భార్యతో కలిసి బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధితుడు గంగిరెడ్డి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కొత్త బస్టాండు ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు రుద్రంగి మండల కేంద్రానికి చెందిన విజయ్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించారు. గత ఎనమిదేళ్లుగా గంగిరెడ్డి ఇంటిలో అద్దెకు ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నానని చెప్పాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడి గంగిరెడ్డి ఇంటిలో చోరీకి పాల్పడ్డట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనపర్చుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

గుడుంబా స్థావరంపై పోలీసుల దాడులు

వీర్నపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాల్‌సింగ్ తండాలో ఎస్‌ఐ ఎల్లాగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. తండాలో ఓ కుటుంబానికి చెందిన 70 లీటర్ల బెల్లం పానకం, 12 కిలోల బెల్లం ధ్వంసం చేసి 2 లీటర్ల గుడుంబాను స్వాధీనపర్చుకుని వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ బాబు, కానిస్టేబుల్ మల్లన్న,కార్తీక్,శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ వైరు చోరీ

ఎల్లారెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పోచమ్మ ఆలయం వద్ద ఉన్న విద్యుత్ మోటార్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అపహరించుకుపోయారు. తీగను కట్ చేయడంతో కాలనీలో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టి నీటి సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మల్కాపూర్ సమీపంలో పెద్దపులి సంచారం

బోయినపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం మల్కాపూర్ గుడ్డేలుగుల గుట్ట సమీపంలో పొలం వద్దకు వెళ్లిన రైతులకు పెద్దపులి కనిపించడంతో భయాందోళనకు గురై గ్రామానికి చేరుకున్నారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలుపడంతో వేములవాడ ఎఫ్‌ఆర్‌వో తన సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లారు. పులికి ఎలాంటి హాని కలిగించవద్దని ప్రజలను రైతులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతానికి పులి ఆనవాళ్లు కనబడలేదని, బుధవారం ఉదయం పెద్దపులి పాదముద్రలు గమనిస్తామని ఎఫ్‌ఆర్‌వో పేర్కొన్నారు.



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు



బెలూన్లను ఎగురవేస్తున్న ఇంటలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి, ఐజీలు, సీపీ

పోరాటాల గడ్డ.. క్రీడల అడ్డాగా మారింది

● ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి ● రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి పోరాటాల గడ్డ కరీంనగర్ ఇప్పుడు క్రీడల అడ్డాగా మారిందని ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి క్రీడా పతాకాన్ని ఎగురవేసి, జ్యోతిని వెలిగింది పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నిర్వహించుకుంటున్న ఈ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడకారులకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్ర క్రీడా పతాకాన్ని ఎగురవేయాలన్నారు. జాతీయపోటీల్లో పతకాలు సాధించే పోలీస్ క్రీడాకారులకు మూడు లక్షల నగదు పురస్కారంతోపాటు ఉద్యోగాల్లో పదోన్నతి కల్పిస్తున్నామన్నారు. ఐజీపీ మల్టీ జోన్-1 ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక అభివృద్ధి కలుగుతుందన్నారు. స్పోర్ట్స్ ఐజీపీ ఎం రమేష్ రెడ్డి మాట్లాడుతూ నిత్య జీవితంలో క్రీడలను ఒక భాగంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, జగిత్యాల ఎస్పీ ఎ లక్ష్మీనారాయణ, కరీంనగర్ అడిషనల్ ఎస్పీ శుభం ప్రకాశ్, కరీంనగర్ ట్రైనీ ఐపీఎస్ యాదవ్ వసుంధర, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.



ఫుట్‌బాల్‌ను కిక్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి

జాతీయ పోలీస్ క్రీడలే లక్ష్యంగా...

- ఎం వెంకటేష్, అంతర్జాతీయ ఖో-ఖో క్రీడాకారుడు, కరీంనగర్



గతంలో ఖోఖో క్రీడాకారుడిగా 34 జతీయస్థాయి పోటీల్లో, ఒక అంతర్జాతీయ స్థాయి ఖో-ఖో పోటీల్లో పాల్గొన్నాను. గత సంవత్సరం పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాను. ఈ సంవత్సరం రాజన్న సిరిసిల్ల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాను. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను.

రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ప్రతి సంవత్సరం నిర్వహించాలి...

- గుండా వీరన్న, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, టీజీఎస్పీ చెల్యాయి



గతంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఈ సంవత్సరం కరీంనగర్‌లో నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. ఈ రాష్ట్రస్థాయి పోటీలను ప్రతి సంవత్సరం నిర్వహించాలి. ఈ పోటీలతో క్రీడాకారులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభ వెలుగులోకి వస్తుంది. గతంలో కబడ్డీ క్రీడల్లో పలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభచాటాను.

వివిధ సంస్థల్లో క్రీడా కోటాను అమలు చేయాలి

ఉట్నూరు రోహిత్, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు, నిజామాబాద్



రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను కరీంనగర్‌లో నిర్వహించడం అభినందనీయం. వివిధ క్రీడల్లో జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభచాటే క్రీడాకారులకు వివిధ సంస్థల్లో క్రీడాకోటాను అమలు చేయాలి. క్రీడాకోటాను అందిస్తున్న పోలీస్, రైల్వేస్, ఆర్మీ, వివిధ సంస్థల్లో కోటా శాతాన్ని పెంచాలి.

ప్రోత్సాహకాలను అందించాలి...

- ఎం భరత్‌చంద్ర, జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు, కొత్తగూడెం



ఈ సంవత్సరం రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహించడం సంతోషంగా ఉంది. ప్రతి సంవత్సరం ఈ క్రీడల నిర్వహణకు కృషి చేయాలి. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులకు ప్రోత్సాహకాలను అందించాలి. ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రైవేట్ సంస్థల్లోనూ ఉద్యోగావకాశాలు కల్పించాలి. గతంలో అనేక జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను.



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న రాజన్న జోన్ జట్టు

● ఆకట్టుకున్న మార్చ్‌ఫాస్ట్

రాష్ట్రంలోని 20 పోలీస్ జోన్ల నుంచి హాజరైన క్రీడాకారులు ప్రదర్శించిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది.

రంగురంగుల ట్రాక్ సూట్లతో 20 జట్లుగా పోలీస్ క్రీడాకారులు అతిథులకు అందించిన గౌరవ వందనం అందరినీ అలరించింది.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్

● క్రీడా జ్యోతిని వెలిగించిన డీజీపీ...

శనివారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే ఈ క్రీడల ప్రారంభోత్సవానికి గుర్తుగా రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ముందుగా జతీయస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు క్రీడా జ్యోతిని మైదానంలో ప్రారంభించి డీజీపీకి అందజేశారు. క్రీడాకారులు మోటార్ బైక్‌పై నిర్వహించిన క్రీడాజ్యోతి రిలే ఆకట్టుకుంది.

ధరణిలో భూములు కోల్పోయినవారికి న్యాయం చేయాలి

● సిరిసిల్ల జిల్లాలో 7 వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా ● రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి సీపీఐ నాయకుల వినతి

తంగళ్లపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ధరణిలో భూములు కోల్పోయిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామానికి చెందిన భూ బాధితులతో కలిసి సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సుద్దాల ప్రభాకర్‌లు హైదరాబాద్‌లో రెవెన్యూ శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. చాలా ఏళ్ల నుంచి నిరుపేదల ఆధీనంలో ఉండి పాసుబుక్కులు ఉన్నప్పటికీ ధరణిలో నమోదు చేయకుండా అన్యాయం చేశారని తెలిపారు. అదే భూమిని అధికారులు అనర్హులైన వారిపై ధరణిలో నమోదు చేశారని తెలిపారు. అప్పటినుంచి అక్రమంగా రైతుబంధు పొందుతూ అవినీతికి పాల్పడ్డారని వారిపై చర్యలు తీసుకొని డబ్బులను రికవరీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామంలో 377 సర్వేనెంబర్‌లోని 120 మందికి చెందిన దాదాపు 350 ఎకరాల భూమిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొని పరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు. భూమిని కోల్పోయి ఉపాధి లేక రోడ్డున పడ్డారన్నారు. చాలామంది దళితుల భూములను బలవంతంగా తీసుకొని పరిహారం ఇవ్వలేదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని చట్టంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం పాటించలేదని పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలం పెద్ద లింగా పూర్ గ్రామంలో 50 ఏళ్ల క్రితం సుంకరులుగా పనిచేసిన రజకులకు ఇచ్చిన 12 ఎకరాల 36 గుంటల భూమిని మరొకరికి వీఆర్వో అక్రమంగా పట్టా చేశాడని తెలిపారు. అక్రమ పట్టాలు పొందిన వారి నుంచి భూమిని రికవరీ చేసి బీఆర్ఓతో పాటు అక్రమ పట్టాల పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో సుమారు ఏడు వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని.. ప్రభుత్వ అవసరాల కోసం తిరిగి తీసుకోవాలని అక్రమ కబ్జాదారులపై, సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని సీబీఐ విచారణ జరిపించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

సౌదీలో రోడ్డు ప్రమాదం

- మెట్‌పల్లి వాసి మృతి



రమేష్(ఫైల్)

మెట్‌పల్లి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మెట్‌పల్లి పట్టణం అనుబంధ గ్రామమైన రేగుంటకు చెందిన కాపెల్లి రమేష్ (30) అనే యువకుడు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 27న సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న రమేష్ అక్కడికక్కడే మృతి చెందారు. అదే విధంగా ఇబ్రహీంపట్నం వర్షకొండ గ్రామానికి చెందిన మరో ముగ్గురు అదే బస్సులో ఉండగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాపెల్లి రమేష్ 3 నెలల క్రితం ఉపాధి కోసం సౌదీ వెళ్లాడు అక్కడ జూబైల్‌లోని ఏసీబీసీ సర్వీస్ కంపెనీలో వారం క్రితం పనిలో కుదిరాడు. సోమవారం ఉదయం పని నిమిత్తం ఏసీబీసీ సర్వీస్ కంపెనీకి చెందిన బస్సులో బయలు దేరారు. 26 మంది ఉద్యోగులతో వెళ్తున్న బస్సు జిజాన్ అరంకో రిఫైనరీ రోడ్డులో ట్రక్కును ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న రమేష్ అక్కడిక క్కడే మృతి చెందాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రమేష్‌కు భార్య శ్వేత, ఇద్దరు కూతుర్లు నందన, శ్రీవల్లిలు ఉన్నారు. వర్షకొండకు చెందిన ముగ్గురు అంకిత్, శ్రీధర్, శ్రీనివాస్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహంను త్వరగా స్వగ్రామం తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమయిందని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడి వయస్సు 25 నుంచి 35 సంవత్సరాలు ఉంటుంది. మృతదేహం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712670764, 9000884443 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

కుల బహిష్కరణపై కేసు

జగిత్యాల రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలపల్లి గ్రామానికి చెందిన దొందరి గంగారాంతో పాటు మరో నాలుగు కుటుంబాలను కులబహిష్కరణ చేసిన రవి, మహేశ్, నడిపయ్య, చిన్నన్న, రాహుల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణ



రోబోటిక్ కిట్లు అందిస్తున్న నిర్వాహకులు

సిరిసిల్ల రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించి సాంకేతికతపై అవగాహన కల్పించే లక్ష్యంగా సోహం అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోబోటిక్స్‌పై మంగళవారం శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 పాఠశాలల్లో శిక్షణ పూర్తి కాగా పట్టణంలోని వెంకంపేట, గీతానగర్ జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు తంగళ్లపల్లి, వెంకటాపూర్, ఎల్లారెడ్డిపేట, గొల్లపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న 643 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌లోని ప్రాథమిక సూత్రాలను నేర్పించారు. అంతేకాకుండా విద్యార్థులకు రోబోటిక్స్ కిట్లను అందించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చొప్పదండి ప్యాక్స్‌ను సందర్శించిన ఒడిశా బృందం

చొప్పదండి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఒడిశా రాష్ట్రానికి చెందిన పలు సహకార సంఘాల పాలకవర్గాలు సందర్శించాయి. ప్యాక్స్ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు గురించి చైర్మన్ వెల్మ మల్లారెడ్డి ఒడిశా బృందానికి వివరించారు. సభ్యులకు ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని, రైతులకు ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకే అందిస్తున్నామని తెలిపారు.



చొప్పదండి ప్యాక్స్ ఎదుట ఒడిశా బృందం

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు కొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవడంపై దృష్టి పెట్టాలని ఓయూ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. శివరామకృష్ణ అన్నారు.మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణలో భాగంగా రెండోరోజు రూల్ ఆఫ్ ఇండస్ట్రీస్-4.0 సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యానుఫాక్చరింగ్ రంగంలో ఆటోమేషన్, రోబోటిక్ విభాగాలు క్రియాశీలకంగా ఉన్నాయన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ పరిజ్ఞానం వస్తు ఉత్పత్తి మాత్రమే కాకుండా ఆధునిక వ్యవసాయ రంగం, వైద్య విధానం తదితర వాటిల్లో ఉపయోగిస్తున్నారన్నారు. వస్తు ఉత్పత్తిని సులభతరం చేసి నాణ్యమైన వస్తువులను ఉత్పత్తి చేసి మానవ జీవితాన్ని మరింత సౌకర్యవంతంగా చేయడమే ఇండస్ట్రీ-4.0 లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. శంకర్,ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొమురయ్య పాల్గొన్నారు.

మృతురాలు మంచిర్యాల వాసిగా గుర్తింపు

● నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లి..

గంగాధర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల శివా రులో అనుమానాస్పదంగా మృతి చెందిన మహిళ మంచిర్యాల వాసిగా పోలీసులు ప్రాథమి కంగా గుర్తించారు. సోమవారం కురిక్యాల శివారులో మహిళ మృతదేహాన్ని గుర్తించిన పోలీ సులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మహిళ మృతి వార్తా పత్రికల్లో, సోష ల్ మీడియాలో చూసిన మంచిర్యాలకు చెందిన వారు పోలీసులకు సమాచారం అందించారు.

ప్రస్తుతం మహిళ మృతదేహం కరీంనగర్ మార్చురీలో భద్రపరచారు. మంచిర్యాల నుంచి ఇక్కడికి ఎందుకు వచ్చింది, ఎవరు తీసుకువచ్చారు, అనే కోణంలో పోలీ సులు విచారణ చేస్తున్నారు.పోలీసులు ప్రాథమికంగా హత్యగా నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా హత్యనా, ఆత్మహత్యనా అనేది తేలుతుందని ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

కాసిపేట : మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రానికి చెందిన మేడ భరత్ ఆసిఫాబాద్ కుమరం భీం జిల్లా పెంచికల్‌పేటకు చెందిన మమత(30)తో ఐదేళ్లుగా సహ జీవనం చేస్తున్నాడు. వీరికి ఒక బాబు ధ్రువన్ (4) ఉన్నాడు. కొంత కాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. నిత్యం మమతను భరత్ వేధించేవాడు. మమతకు తల్లిదండ్రులు లేరు. మమత గత ఏడాది అక్టోబరులో మమత ఇంటి నుంచి వెళ్లి బంధువుల వద్ద ఉంటుంది. శనివారం దుకాణానికి వెళతానని చెప్పి బాబుతో కలిసి బయటకు వెళ్లి తిరిగి లేదు. దీంతో బంధువులు సమీపంలోని సీసీ ఫుటేజీ పరిశీలించగా బాబుతో కలిసి ఓ కారులో ఎక్కి వెళ్లినట్లు గుర్తించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల శివారు ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం లభించింది. పత్రికల్లో, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను చూసిన బంధువులు ఆ మృతదేహం మమతదిగా గుర్తించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు

మల్యాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభి షేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు

వేములవాడ కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీబద్ది పోచమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన మంగళవారం మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మ ఆలయానికి తరలిరావడంతో క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించి ఆలయంలోకి చేరుకున్నారు. ముందుగా భక్తులు పిల్లాపాపలు, పాడిపంటలు చల్లగా ఉండాలని అమ్మవారికి పట్నం వేసి పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని నైవేద్యం సమర్పించి కల్లుసాకతో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బద్దిపోచమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరా?

ఎండపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో మోడు బారిన వృక్షం ప్రమాదకంగా మారింది. ఈ వృక్షం ఎండిపోయి సంవత్సరం గడిచింది. రాజారాంపల్లి జాతీయ రహదారి పక్కన ఈ వృక్షం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కరీంనగర్-రాయపట్నం జాతీయ రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు నడుస్తుంటాయి. రోడ్డుపై వాహనాలు వెళ్ళేటప్పుడు పడితే ప్రయాణికులకు ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వృక్షాన్ని తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.



రాజారాంపల్లిలో ప్రమాదకరంగా ఉన్న వృక్షం

పండుటాకులకు ఆసరా

వృద్ధులకు అండగా 'చార్వాక సంక్షేమ సంఘం'



సమావేశమైన వృద్ధులు..

ఎల్లారెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్న పండు టాకులకు ఆసరాగా నిలుస్తోంది చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘం. మలిసంధ్యలో తనలాగే నిరాదరణకు గురైన వారందరికీ అండగా నిలవాలన్న ఓ వృద్ధుడి ఆలోచనతో ఈ సంఘం ఏర్పాటైంది. గ్రామంలో వృద్ధుల సమస్యలను పరిష్కరించేందుకు.. ఒకరికొకరు సహకరించుకుంటున్నారు. ఆపద వస్తే తామున్నామంటూ భరోసా కల్పిస్తున్నారు. తలా కొంత డబ్బులు పోగు చేసుకుని ఆర్థిక అవసరాలకు సహకారం అందిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని వృద్ధులు సంఘంగా ఏర్పడి పొదుపు చేసిన డబ్బులతో స్వంతంగా సంఘ భవనాన్ని నిర్మించుకున్నారు.

● **ఏకతాటిపైకి వచ్చి..**

మండలంలోని పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లో వృద్ధులు పడుతున్న ఇబ్బందులకు పరిష్కార మార్గం కోసం సంఘం ఏర్పాటు చేయాలనే ఆలోచన గ్రామంలోని వృద్ధుడు లచ్చాగౌడ్‌కు వచ్చింది. రెండు గ్రామాల్లో కొడుకులు, కోడళ్ల కారణంగా అవస్థల పాలవు తున్న వృద్ధులకు అండగా నిలవాలనుకున్నారు. ఆయ గ్రామాల్లోని వృద్ధులతో చర్చించారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు సంఘంగా ఏర్పడాలని నిర్ణయించుకున్నారు. అందుకు 2008లో 250 మంది వృద్ధులతో చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నెలకు రూ.50లతో పొదుపు ప్రారంభించారు. ప్రస్తుతం 400 మందితో వృద్ధుల సంక్షేమ సంఘం కొనసాగుతోంది. రూ.15లక్షలతో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. ప్రతి ఆరు నెలలకోసారి సమావేశం ఏర్పాటు చేసుకొని తమ యోగక్షేమాలపై చర్చించుకుంటున్నారు. కొడుకులు, కోడళ్ల నుంచి ఏమైనా సమస్యలుంటే వారిని సమావేశానికి పిలిపించి మందలిస్తూ కంటికి రెప్పలా చూసుకోవాలని అంటున్నారు. వృద్ధులకు ఏ ఆపద వచ్చినా పరిష్కరిస్తున్నారు. దాంతో ఆ రెండు గ్రామాల్లో వృద్ధులు ఆనందంగా గడుపుతున్నారు.

● **రాణా మెట్లెక్కని వృద్ధులు..**

తమను కన్నబిడ్డలు పట్టించుకోకవడం లేదంటూ పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని వృద్ధులు ఠాణా మెట్లెక్కరు. పోలీసులను ఆశ్రయించరు. గ్రామంలోని వృద్ధుల సంక్షేమ సంఘానికి చేరుకుంటారు. తమ కష్టాలను వివరిస్తారు. దాంతో ఆయా కుటుంబాల సభ్యులను పిలిచి మంచిగా చూసుకోవాలని సంఘం సభ్యులు మందలిస్తారు. తమ మాట కాదంటే కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరిస్తారు. తద్వారా సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తున్నారు.

● **నిరాదరణకు గురైన వారి సమస్యల పరిష్కారానికి కృషి**

● **ఆర్థిక అవసరాలకు సహకారం..**

చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘంలోని సభ్యుల ఆర్థిక అవసరాలకు సహకారం అందిస్తున్నారు. ఒక్కో సభ్యుడికి రూ.20వేల నుంచి రూ.50 వేల వరకు రూపాయి వడ్డీకి ఇస్తూ ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడుతున్నారు. ప్రస్తుతం రూ.15లక్షలతో నిరాటంకంగా సాగిస్తున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి స్థలం లేకపోవడం వల్ల భవన నిర్మాణానికి నిర్ణయించుకున్నారు. పదిర గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన వ్యక్తి తనకున్న రూ.20లక్షల విలువైన నాలుగు గుంటల స్థలాన్ని వృద్ధులకు విరాళంగా అందజేశారు. దాంతో యేడాది కిందట ఆ స్థలంలో సుమారు రూ.11లక్షలతో సంఘ భవనం నిర్మించుకున్నారు.

మంచిగా చూసుకుంటుండ్రు

- వట్టెల లస్మవ్వ, వృద్ధురాలు



గ్రామంలోని వృద్ధుల సంక్షేమ సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతున్నా. ఏదైనా సమస్య వస్తే సభ్యుల దృష్టికి తీసుకెళుతా. మా ఇంటిలో కొడుకులు, కోడళ్లు మంచిగా చూసుకుంటుండ్రు. ఆర్థిక అవసరాలకు డబ్బులను తీసుకుని సంతోషంగా ఉంటున్నా.

ఏ ఆపద వచ్చినా ముందుంటాం...

- కంచర్ల నర్సయ్య, సంఘం అధ్యక్షుడు



రెండు గ్రామాల్లోని నాలాంటి వృద్ధులు పడుతున్న బాధలను మేమే పరిష్కరించుకునేందుకు సంఘంగా ఏర్పడ్డాం. సభ్యులకు ఏ ఆపద వచ్చినా ముందుంటాం. పదిర గ్రామంలోని గుల్లపల్లి హన్మయ్య అనే వృద్ధుడికి ఎవరూ లేకపోవడంతో మేమే సపర్యలు చేశాం.

ప్రభుత్వం కృషి చేయాలి

- తాళ్లపల్లి లచ్చాగౌడ్, సంఘం వ్యవస్థాపకుడు



పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని వృద్ధుల అవస్థలను కళ్లారా చూశా. పరిష్కార మార్గానికి వృద్ధులంతా సంఘంగా ఏర్పడితే ఏదైనా సాధించవచ్చని అనుకున్నాం. 2008లో సంఘం ఏర్పాటు చేసుకున్నాం. ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం కృషి చేయాలి.

వర్గీకరణ అమలు వేగవంతం చేయాలి

● **కవ్వంపల్లి నేతృత్వంలో సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు**



హైదరాబాద్‌లో సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు

మానకొండూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు అవసరమైన శాసన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మానకొండూర్ శాసన సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం కోరారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన విజవంతంగా ముగించుకొని స్వరాష్ట్రానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డిని కవ్వంపల్లి నేతృత్వంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామ్యేల్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై సీ ఎం రేవంత్‌రెడ్డితో చర్చించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ కోసం వివిధ రాష్ట్రాలుఆ ప్రక్రియను చేపట్టాయని, అందులో భాగంగానే రాష్ట్రంలో వర్గీకరణకు శ్రీకారం చుట్టాలన్నారు.

డ్రైవర్ల నైపుణ్యంతోనే ప్రమాదాల రేటు తక్కువ

● **డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం**



ప్రశంసా పత్రాలు అందుకున్న డ్రైవర్లతో అధికారులు

భగత్‌నగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్ల నైపుణ్యంతోనే ప్రమాదాల రేటు తక్కువగా ఉంటుందని కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం అన్నారు. మంగళవారం ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ డ్రైవర్ వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు మాట్లాడుతూ మానవ తప్పిదాలతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ బస్సులు నడపాలన్నారు. అత్యంత ప్రమాద రహిత సర్వీసు డ్రైవర్లు సీహెచ్ ఆగయ్య (హుజూరాబాద్), అల్‌తాఫ్ హుస్సేన్ (కరీంనగర్-2), బి.రాజు (సిరిసిల్ల)తోపాటు ప్రతీ డిపో నుంచి 33 మంది డ్రైవర్లను డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషర్ పురుషోత్తం జిల్లా రవాణా అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, ఆర్ఎం రాజు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు సత్యనారాయణ, భూపతిరెడ్డి, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్‌లు విజయమాధురి, మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, రీజియన్‌లోని తొమ్మిది డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో సంఘం పటిష్టానికి చర్యలు

● **బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ పాలాస నరేందర్**

వేములవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బీసీ సాధికారిత సంఘాన్ని గ్రామస్థాయిలో పటిష్టం చేస్తామని సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ పొలాస నరేందర్ అన్నారు. మంగళవారం వేములవాడలో జరిగిన పట్టణ బీసీ సాధికారిత సంఘం కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ యువత, మహిళ సంక్షేమం, ఐక్యతతో పాటు వారి సమస్యలను పరిష్కరించేందుకు సంఘం తరఫున ప్రయత్నం చేస్తామని అన్నారు. బీసీ సాధికారత సంఘాన్ని మరింత పటిష్టం చేసే క్రమంలో వేములవాడ పట్టణ మహిళ అధ్యక్షులుగా నీతూ, ప్రధాన కార్యదర్శిగా చింతలటానం తేజస్విని, జిల్లా మహిళ అధ్యక్షులుగా గుజ్జె తార, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పడిగేల మానస, ప్రధాన కార్యదర్శిగా మెరుగు జల, వేములవాడ పట్టణ యువత కమిటీ అధ్యక్షులుగా గంగ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా యిన్నారపు సాగర్, జిల్లా యువత అధ్యక్షులుగా అంకారపు మహేష్, ప్రధాన కార్యదర్శిగా గుజ్జే శివరామ్‌ను నియమించినట్లు తెలిపారు. వేములవాడ పట్టణంలోని 28 వార్డులకు త్వరలోనే కమిటీలు నియమిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో పట్టణ శాఖ అధ్యక్షుడు తూపుకారి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి ఇల్లందుల వెంకటేష్, ఉపాధ్యక్షులు ఉయ్యాల భూమయ్య, ఏంఏ.రాహిల్, ఎండీ అబ్దుల్ పాషా, అన్నారపు సాయి కుమార్, జిల్లా బీసీ సాధికారిత సంఘం ప్రచార కార్యదర్శి అంబాటి సంతోష్, ఉపాధ్యక్షులు గోగికారి సత్యం, అధికార ప్రతినిధి మైలారం రాము, కార్యనిర్వాహక కార్యదర్శి సీహెచ్.రామస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలాస నరేందర్

రాజకీయాల కోసం ప్రభుత్వ ఉద్యోగులను బలిచేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కరీంనగర్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ భాగస్వామ్య పక్షాలు

సుభాష్‌నగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ ఉద్యోగులను బలిచేయొద్దని కరీంనగర్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ భాగస్వామ్య పక్షాల నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన జేఏసీ సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులతోపాటు కేంద్ర సహాయ మంత్రి హాజరయ్యారని, కలెక్టర్, పోలీసు కమిషనర్ అన్ని ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రులందరూ ఒకేసారి వేదికపై రావడంతో కొంత తోపులాట జరిగిందని, దీనిపై మంత్రులు అసహనాన్ని వ్యక్తం చేస్తూ కలెక్టర్‌ను బాధ్యురాలిని చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కలెక్టర్ అహర్నిశలు పని చేస్తున్నారని, అలాంటి కలెక్టర్‌పై ప్రజాప్రతినిధులు అసహనంతో మాట్లాడడం ఎంతవరకు సబబని అన్నారు. దీనిపై ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి విచారం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ పట్ల చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో భవిష్యత్‌లో తమ మద్దతు ఉండదని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెప్పే విధానం తమకూ తెలుసన్నారు. కాలం ఎప్పుడు ఒకేలా ఉండదని, ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు గుర్తెరగాలని అన్నారు. సంఘటనను జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు, టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్ఎం హుస్సేని దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళిచరణ్, కార్యదర్శి అరవింద్‌రెడ్డి, డీడీ నాగరాజు, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు వొంటెల రవీందర్‌రెడ్డి, కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, మహిళా జేఏసీ చైర్‌పర్సన్ శారద, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు మంజిత్‌సింగ్, ఎండీ వారిస్, టీఎన్‌జీవో టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, కార్యదర్శి సుమంత్‌రావు, పోలు కిషన్, కేశవరెడ్డి, లింగయ్య, సబిత, సునీత, విజయలక్ష్మి, మల్క రాజేశ్వరరావు, కొండయ్య, అజయ్, ప్రవీణ్, అభిషేక్, గిరిధర్‌రావు, సత్యం, అనిల్, నగేశ్, బోనాల రవి, అజయ్, బాలాజీ, అంజయ్య, రమేశ్, వహీస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు



ఆరెపల్లి బస్ స్టేజీ సమీపంలో ఉన్న మూల మలుపు

కొడిమ్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల రహదారిపై మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రహదారిపై ప్రతి నిత్యం వేలాది వాహనాలు వెళుతుంటాయి. కొడిమ్యాల మండలం దొంగలమర్రి పోలీస్ చెక్‌పోస్ట్ (జేఎన్‌టీయూ ఎక్స్ రోడ్డు) నుంచి తురుక కాశీనగర్ వరకు ఉన్న మూల మలుపులు ఉన్నాయి. కనీసం హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురెదురుగా వాహనాలు ఢీ కొట్టడం, వేగంగా వచ్చిన వాహనాలు అదుపు తప్పి బోల్తా పడడంలాంటి సంఘటనటుల జరుగుతు న్నాయి. వాహనాలు ఢీ కొట్టడంతో ఈ రోడ్డుపై పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు.. మండలంలోని పూడూర్ అనుబంధ గ్రామమైన ఆరెపల్లి వద్ద, పూడూర్ గ్రామ శివారులో ఎల్లమ్మ గుడి వద్ద ప్రమాదకరమైన మూల మలుప ఉన్నది. మండలంలోని పూడూర్ బస్‌స్టాప్ సమీపంలో గతంలో స్పీడ్ బ్రేకర్లు ఉండేవి. కొన్నేళ్ళ క్రితం వాటిని తొలిగించారు. దీంతో వాహనాలు వేగంగా వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయి.



బోల్తా పడ్డ వ్యాన్(ఫైల్)

ఫిలిగ్రీ కళాకారుల ఉత్పత్తుల పరిశీలన



ఫిలిగ్రీ కళకు చెందిన కళాకారుల ఉత్పత్తులను పరిశీస్తున్న శాస్త్రవేత్తల బృందం

కరీంనగర్ కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలిగ్రీ ఉత్పత్తులను, తయారీ కేంద్రాన్ని మంగళవారం దేశంలోని ఏఎస్‌సీఐ శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. 2007లో జీఐ గుర్తింపు ఉన్న ఫిలిగ్రీ సంస్థలో వెండి తీగల ఉత్పత్తులు, కళాకారుల పనితీరును సభ్యులు పరిశీలించారు. కళాకారులతో మాట్లాడి వివరాలు తెసుకున్నారు. కరీంనగర్ ఫిలిగ్రీ సొసైటీ బాధ్యులు అశోక్, వెంకటేశ్, అశోక్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఐపీఆర్ఏఎస్ అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సుభాజిత్ షా నాయకత్వంలో బృందం సభ్యులు పాల్గొన్నారు.

'రంగు'ల కళ..

● **నాటక రంగంలో రాణిస్తున్న జేఏవో రంగు వెంకట నారాయణ**

● **ఉద్యోగం చేస్తూనే నాటికల ప్రదర్శన**

గణేశ్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆయన నలుగురికి వినోదం పంచడానికి సాంఘిక నాటకాలలో పాత్రలను పోషిస్తారు. ప్రజలను చైతన్య పరచడానికి సామాజిక అంశాలపై ప్రదర్శనలు ఇస్తారు. వృత్తి రీత్యా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నప్పటికీ తీరిక సమయాలలో కళాకారుడిగా తన నైపుణ్యాన్ని చాటుతున్నాడు. ఆయన కరీంనగర్‌లో విద్యుత్ శాఖ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రంగు వెంకటనారాయణ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఎన్నో 300 ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేక్షకుల నుంచి మన్ననలు పొందడంతోపాటు ఉత్తమ కళాకారుడిగా పలు అవార్డులు అందుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండు సార్లు ప్రతిష్ఠాత్మకమైన నంది అవార్డు దక్కించుకున్నారు. ప్రేమ ఈజ్ ఈక్వల్ టూ నాటక ప్రదర్శనలో ఉత్తమ విలన్‌గా అవార్డు దక్కించుకున్నారు. తొలిసారిగా ప్రభు తిప్పర్తి దర్శకత్వంలో మన ఊరి ముచ్చట్లు ఛానల్ వారు నిర్మించిన 'చీర చినిగింది తిక్క కుదిరింది' అనే షార్ట్‌ఫిలిం లో నటించాడు. దీనిని మూడు లక్షల మంది వీక్షించారు. ఆ తర్వాత ఎన్నో షార్ట్ ఫిలింలలో నటించారు. రంగు వెంకటనారాయణ నటించిన క్లిక్, లాల లీల, చెల్లని పైసలు, దొంగలు, ఖరీదైన జైళ్లు, స్వప్నం రాల్చిన అమృతం, ఈ లెక్క ఇంతే, చీకటి పువ్వు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వందలాది ప్రదర్శనతో ఎన్నో బహుమతులు అందుకున్నారు. 2006లో నిజామాబాద్‌లో ప్రేమా ఈజ్ ఈక్వల్ టు, 2010 నంద్యాలలో జరిగిన చెల్లని పైసలు నాటికతో ఆయనను కాంస్య నంది అవార్డు వరించింది. 2017 కర్నూల్‌లో ఈ లెక్క ఇంతే, 2016 రాజమండ్రిలో మా ప్రేమకు న్యాయం కావాలి, 2023 గుంటూరులో చీకటి పువ్వు నాటకానికి ఉత్తమ కాంస్య నంది అవార్డు అందుకున్నారు. విద్యు త్ శాఖ భద్రతా వారోత్సవాల సందర్భంగా లఘు చిత్రాలను, నాటకాలను వేసి విద్యుత్ భద్రత గురించి గృహజ్యోతి, విద్యుత్ సైనికుడు, ఈ స్మార్ట్ కరెంట్ బిల్లుల గురించి అవగాహన కల్పించేందుకు ప్రదర్శ నలు ఇచ్చారు. చదువుకునే రోజుల్లో విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో రంగు వెంకట నారాయణ కెప్టెన్‌గా జట్టును ముందుకు నడిపిం చారు. కరీంనగర్ జట్టును రాష్ట్రస్థాయి పోటీల్లో విజే తగా నిలిపారు. బాస్కెట్ బాల్ క్రీడలోనూ ఆయనకు ప్రవేశం ఉంది.



ఖరీదైన జైళ్లు ప్రదర్శనలో రంగు వెంకటనారాయణ



మాజీ మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా ఉత్తమ నంది అవార్డు అందుకుంటున్న వెంకటనారాయణ

కార్మిక కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ చేయూత



నిత్యావసర సరుకులు, నగదు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నిర్మించుకున్న గుడిసెలు అగ్ని ప్రమాదంతో కాలిపోయి నిరాశ్రయులైన ఛత్తీస్‌గఢ్ కార్మిక కుటుంబాలకు మంగళవారం బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ శాఖ చేయూతను అందించింది. సిరిసిల్ల పట్టణం సాయినగర్ శివారులో రెండు రోజుల క్రితం షార్ట్‌సర్క్యూట్‌తో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కార్మికుల గుడిసెలు దగ్ధం అయిన విషయం తెలిసిందే. ఉపాధి వెతుకుంటూ ఛత్తీస్‌గఢ్ నుంచి సిరిసిల్లకు వలస వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న కార్మికులు వేసుకున్న గుడిసెలు కాలిపోవడంతో నిలువనీడ లేకుండా పోయింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆదేశాలతో బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల పట్టణ నాయకులు కార్మికుల కుటుంబాలను ఆదుకోవడం కోసం ముందుకొచ్చారు. 14 కార్మిక కుటుంబాలకు ఒక్కక్కరికి నెల రోజుల పాటు సరిపడా నిత్యావసర సరుకులు, దుప్పట్లు, వేయి రూపాయల చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, మహిళ పట్టణ అధ్యక్షురాలు బత్తుల వనజ, బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్‌చైర్మన్ ఆడగట్ల మురళి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, గ్రంథాలయం జిల్లా మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మాజీ కౌన్సిలర్లు దార్నం అరుణలక్ష్మీనారాయణ, నంది శంకర్, బీఆర్ఎస్ నాయకులు బత్తుల రమేష్, వేముల హరికృష్ణ, తుమ్మ రాజు, కార్మికులు పాల్గొన్నారు.

మహాప్రదర్శనకు భారీగా తరలిరావాలి

ఇల్లంతకుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్ పేర్కొన్నారు. మండలంలోని దాచారం గ్రామంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7న వెయ్యిగొంతులు, లక్ష డప్పులతో జరిగే కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంద రాజుమాదిగ, నాయకులు తడకపెల్లి భూమయ్య, పసుల వెంకటి, కోలపురం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ముస్తాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. 33 మంది లబ్ధిదారులకు రూ.6 లక్షల 72 వేల విలువ చేసే చెక్కులను అందించారు. బడుగుబలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, రాంరెడ్డి, షాదుల్‌పాష, రంజాని నరేశ్, శీల ప్రశాంత్,తాళ్ల విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రుద్రంగి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం ఉమ్మడి మానాల గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాలు మోహన్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా విడుదలపై సంబరాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జగపతి, జక్కు మోహన్, గోపిడి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి..

సిరిసిల్ల రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బడుగు పెద్దలింగయ్య, నాయకులు వల్లంపట్ల నాంపల్లి, రామచంద్రం, వల్లంపట్లరాజు, బుర్ర శంకర్, కొమ్మెట శ్యాముల్, లింగంపల్లి శ్రీనివాస్, కత్తెర పెద్దరాజయ్య పాల్గొన్నారు.

శిథిలావస్థలో అనంతారం అతిథి గృహం



అనంతారం గ్రామంలోని అతిథి గృహం

ఇల్లంతకుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నిజాం కాలంలో నిర్మించిన అనంతారం అతిథి గృహం శిథిలావస్థకు చేరింది. హైదరాబాద్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాలంలో పరిపాలన సౌలభ్యం, అధికారుల విడిది కోసం 1926లో అతిథి గృహాన్ని నిర్మించారు. భవనంపైన నిర్మించిన కాలాన్ని తెలిపే శిలాఫలకం ఉర్దూ, ఇంగ్లీష్ భాషలో ఇప్పటికీ కనిపిస్తుంది. తర్వాత కాలంలో పోలీస్‌స్టేషన్‌గా ఉపయోగపడింది. ఇదేగ్రామంలోని అనంతారం ప్రాజెక్టుకు మరమ్మతులను 1983లో చేపట్టగా, అతిథి గృహానికి సైతం నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టారు. అప్పటినుంచి ఈ భవనం ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వెళ్లింది. అతిథిగృహంతో పాటు రెండు ఎకరాల ఖాళీస్థలం ఉంది. అతిథి గృహంలోని ఫర్నీచర్ అధికారుల పాలయ్యింది. ఖాళీ స్థలాన్ని గ్రామపంచాయతీ పరిధిలో చేర్చాలని గ్రామస్థులు గతంలో తహసీల్దార్‌కు విన్నవించారు. కలెక్టర్‌కు సిఫారసు చేసినా ఫైల్ పెండింగ్‌లోనే ఉండిపోయింది. ప్రస్తుతం అతిథిగృహం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అతిథి గృహం పరిధిలోని ఖాళీ స్థలంలో గ్రామస్థులు ఓపెన్‌జిమ్, క్రీడాప్రాంగణం, వారసంతను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి కట్టడాన్ని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత

వీర్నపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్ విద్యార్థులు విధిగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మండల వైద్యాధికారి డాక్టర్ సరియా అంజుమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ హెల్త్ క్యాంప్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను స్థానిక ఎమ్మార్వో మారుతిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలోని వసతి గృహాలను, వంటగదిని, ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు వడ్డించే వంట మనుషులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మెడికల్ హెల్త్ క్యాంపులో 274 విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారిని డాక్టర్ సరియా అంజుమ్ తెలిపారు. ఈకార్యక్రమంలో డీడీఎం కార్తీక్, సూపర్‌వైజర్ ఇందిర, హెల్త్‌అసిస్టెంట్ బాబు, ఎమ్ ఎల్‌హెచ్‌పీ చైతన్య, ఏఎన్‌ఎంలు సుజాత, కీర్తి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి.

ఎల్లారెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పని చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను అమలు చేసి వైద్య, ఆరోగ్య సేవలను అందించి జిల్లాను ముందు వరుసలో నిలపాలని జిల్లా వైద్యాధికారి రజిత అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. కేంద్రంలోని రికార్డులు, సిబ్బంది వివరాలు, రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి రజిత మాట్లాడుతూ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతులను చేయాలని అన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి రజిత హెచ్చరించారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి సారియా, సిబ్బంది ఉన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన మినీ ఫంక్షన్‌హాల్



సిరిసిల్ల జ్యోతినగర్‌లో ప్రారంభానికి సిద్ధమైన మినీ ఫంక్షన్‌హాల్

సిరిసిల్ల రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సమావేశాలు, ఫంక్షన్లు జరుపుకునేందుకు గత ప్రభుత్వం కేసీఆర్ ప్రగతి భవనాన్ని నిర్మించగా, సిరిసిల్ల మున్సిపల్ అధికారులు లక్షలాది రూపాయలను వెచ్చించి మినీ ఫంక్షన్‌హాల్‌గా మార్పులు చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు.

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ ప్రగతి భవనాల నిర్మాణానికి నిధులను మంజూరు చేసింది. దీంతో అప్పటి గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామశివారులోని జ్యోతినగర్‌లో ఉన్న ప్రభుత్వం భూమిలో ప్రగతి భవనాన్ని ఏర్పాటుచేశారు. అయితే సిరిసిల్ల పట్టణానికి ఆనుకొని ఉన్న ఏడు గ్రామాలను మున్సిపల్‌లో విలీనం చేయడంతో భవనాలను మున్సిపల్ అధికారుల స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు రగుడు-జ్యోతినగర్‌లో అసంపూర్తిగా ఉన్న ప్రగతి భవనానికి రూ.25లక్షలను మున్సిపల్ నిధులను కేటాయించి మినీ ఫంక్షన్ హాల్‌గా తీర్చిదిద్దారు. అయితే ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నిలిచిపోయింది. దీంతో భవనాన్ని పట్టించుకునే వారు లేక చుట్టూ చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి అసాంఘిక కార్యకాలపాలకు అడ్డాగా మారింది. అంతేకాకుండా అందులో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు, కిటికీలు, మరుగుదొడ్లను ఆకతాయిలు ధ్వంసం చేశారు. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో 'శిథిల ప్రగతి ప్రాంగాణాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ పాలకవర్గం, కమిషనర్, అధికారులు స్పందించారు. మినీ ఫంక్షన్‌హాల్‌ను పరిశీలించి తగిన చర్యలు చేపట్టారు. త్వరలో భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

త్వరలో అందుబాటులోకి తెస్తాం..

- పోచవేని సత్యంల్లయ్య, తాజామాజీ కౌన్సిలర్



మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు రగుడు-జ్యోతినగర్ పరిధిలో ఉన్న కేసీఆర్ ప్రగతి భవనానికి రూ.25 లక్షల మున్సిపల్ నిధులు కేటాయించి మినీ ఫంక్షన్‌హాల్‌గా మార్పులుచేశాం. ప్రజలకు అందుబాటులో తెచ్చే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ప్రారంభోత్సవం నిలిచిపోయి తర్వాత అధ్వానంగా తయారైంది. తిరిగి మర్మతులు చేయించి త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు కృషి చేస్తున్నాం.

కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

తంగళ్లపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రామ కూడలిలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేసిన అనంతరం మాట్లాడుతూ బేషరతుగా క్షమాపణలు చెప్పి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మన సంక్షేమ సంఘం అధ్యక్షులు సందీప్, నాయకులు నక్క నరేష్, నక్క రవి, యాస మధు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుభద్రతా నియమాలను పాటించాలి

ఇల్లంతకుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్సై కదిరె శ్రీకాంత్ సూచించారు. మండలకేంద్రంలో మంగళవారం అభయ యాప్‌లో భాగంగా 80ఆటలోను క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం చేశారు. క్యూఆర్ కోడ్ ద్వారా ప్రయాణికులకు భద్రత ఉంటుందన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు విపత్కర పరిస్థితి ఎదురైతే ఆటోకు ముద్రించిన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా గతంలో డ్రైవర్లు ఏదైన పోలీసు కేసులలో ఉన్నట్లయితే కూడా తెలుస్తుందన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి - ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

వీర్నపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేస్తున్న విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ విద్యార్థుల పక్షాన ఎస్ఎఫ్ఐ పోరాడుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. వచ్చేనెల 5, 6 తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ వీర్నపల్లి మండల కమిటీ అధ్యక్షుడిగా రాబిన్సన్, కార్యదర్శిగా వినయ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సందీప్, వర్షిత్, కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ గంభీరావుపేట మండల కార్యవర్గం

గంభీరావుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ మంగళవారం ఎన్నికైంది. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడిగా శివచరణ్, మండల ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌తేజ, ఉపాధ్యక్షులుగా నవీన్, అరుణ్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా తేజ, భానుచందర్, రాకేష్, విజయ్‌కుమార్, గౌతమ్‌గౌడ్, శివ, మహేష్, మనిసా, సాయి, మేఘన, అక్షయ్, అంకిత, భారతి ఎన్నికయ్యారు. ఈ కమిటీ ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికైంది. ఈ సందర్భంగా కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. ఫిబ్రవరి 5,6 తేదీలలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహా సభకు విద్యార్థి మేధావులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కళ్యాణ్‌కుమార్ పిలుపునిచ్చారు.

మానేరు నీరు విడుదల చేసి పంటపొలాలను కాపాడాలి



మానేరు కెనాల్‌ను పరిశీలిస్తున్న సురేందర్‌రావు తదితరులు


ముస్తాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎగువ మానేరు చివరిఆయకట్టు వరకు సరిపడా నీటిని విడుదల చేసి వరి పంట పొలాలను కాపాడాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు పేర్కొన్నారు. ముస్తాబాద్-పోతుగల్ రహదారిలో గల మానేరు కాలువను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా సురేందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాలవారు అసంతృప్తితో ఉన్నార న్నారు. వారాబందీ కాకుండా ప్రతి రోజు నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలన్నారు. మల్లన్న సాగర్ నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని, భూగర్భ జాలాలు పెరిగేలా చూడాలన్నారు. కేసీఆర్‌తోనే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కోఆప్షన్ మెంబర్ ఎండీ సర్వర్‌పాషా, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహరెడ్డి, శీలం స్వామి, మెంగని మనోహర్, కోడె శ్రీను, డబ్బెడ రాజు, సుంచు సుధాకర్, నాని తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి, మత్తు పదార్థాలపై అవగాహన

గంభీరావుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మానసిక ఒత్తిడి, మత్తు పదార్థాల అలవాటు, నివారణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ముఖ్య వ్యక్తగా సిరిసిల్ల సైక్రియాటిస్ట్ డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల అలవాటుతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బందిని సన్మానించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ పీవో ధర్మపురి, అధ్యాపకులు డాక్టర్ బిక్షమయ్య పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌పై వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

- మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు



మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాములు

సిరిసిల్ల టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పద్మ అవార్డుల ఎంపికలో ప్రజా గాయకుడు గద్దర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి హోదాలో ఉండి ప్రజా ఉద్యమ గాయకుడు గద్దర్‌ను అవమానించడం బాధాకరమన్నారు. బీసీ మండల్ కమిషన్ కోసం నాడు గద్దర్ గజ్జెలు కట్టి ప్రజా ఉద్యమం చేశాడని, బీసీ బిడ్డ అయిన బండి సంజయ్ గద్దర్‌ను విమర్శించడం సరికాదన్నారు. నక్సలైట్‌గా గద్దర్ ఎంత మందిని చంపాడో ఈనెల 30 లోపు రుజువు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తావద్ద తాము ఉంటామని బండి సంజయ్ వచ్చి రుజువుచేయాలని డిమాండ్ చేశారు. పద్మ అవార్డులు ఇవ్వాలని గద్దర్ కుటుంబం అడగలేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన పంపించిందన్నారు. అనవసరమైన విమర్శలు చేయవద్దన్నారు. బీసీ నాయకుడని దళితులకు బండి సంజయ్ అంటే అభిమానం ఉందని, ఆ గౌరవాన్ని తగ్గించుకోవద్దని హితవు పలికారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాఘమాసం జాతరొచ్చింది..

(5వ పేజీ తరువాయి)

పలుగ్రామాల భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

కోర్కెలు తీర్చే అంజన్న..

● గంభీరావుపేట : ఎటు చూసినా పాలరాతి బండలు.. చుట్టూ ఎత్తైన గుట్టలు.. పచ్చని పంట పొలాలు.. అపురూప రాతి కట్టడంతో చారిత్రాత్మక ప్రాధాన్యతం కలిగిన కోవెలగా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలోని శ్రీఅంజన్నస్వామి ఆలయానికి పేరుంది. శ్రీసీతారాముల ఆలయంలోపాటు శ్రీవెంకటేశ్వరస్వామి, శివాలయం కూడా ఇక్కడే ఉన్నాయి. ఈ మూడు ఆలయాలను భక్తులు దర్శించుకుని పూజలు చేసి, పలురకాల నైవేద్యాలు సమర్పిస్తారు. రామచంద్రస్వామి, అంజన్నస్వామి ఆలయాలు అభిముఖంగా ఉండటమే కాకుండా అంజన్న కంటి కాంతికిరణాలు రాముని పాదాల్ని ఎల్లవేళలా స్పృశించేలా చేసిన ఆ కళావైభవం మహాద్భుతంగా చెప్పుకుంటారు. మల్లారెడ్డిపేట ఆంజనేయస్వామి కోరిన కోరికలు తీర్చే దేవుడిగా పూజలందుకుంటున్నాడు. ఏటా మాఘ అమావాస్య రోజున భీమునిమల్లారెడ్డిపేట శ్రీఆంజనేయ స్వామి ఆలయం వద్ద జాతర సాగుతోంది. శుక్రవారం నుంచి జరిగే అంజన్న జాతరకు రామారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, దుబ్బాక, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట తదితర ప్రాంతాలనుంచి భక్తులు వస్తారు.

భక్తుల కోర్కెలు తీరుస్తాడు..

- కమలాకర్‌శర్మ, ఆలయ పూజారి, భీమునిమల్లారెడ్డిపేట



భీమునిమల్లారెడ్డిపేట అంజన్నను భక్తిశ్రద్ధలతో కొలిస్తే తప్పకుండా భక్తుల కోరికలు తీరుస్తాడు. ఏ కష్టం వచ్చిన అంజన్న ఆలయాని భక్తులు వచ్చి దర్శించుకుంటారు. ఈ ప్రాంతంలో ఎక్కడా లేని విధంగా చుట్టూ గుట్టలు,చెట్లు, నిత్యం పారే మాండవ్య నది మధ్య స్వామివారు కొలువు దీరాడు. ఈ ఆలయానికి ఓ ప్రత్యేక ఉంది. పవిత్రమైన గుండంలో స్నానమాచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తే, ఎంతటి కోరికలైనా నెరవేరుతాయి. ప్రతిఏటా మాఘ అమావాస్య రోజున స్వామిని దర్శించుకునేందుకు చాలా దూరం నుంచి భక్తులు వేలాదిగా వస్తారు.

అంజన్న జాతరకు అన్ని ఏర్పాట్లు చేశాం..

- మణిదీప్‌రెడ్డి, ఆలయ చైర్మన్, భీమునిమల్లారెడ్డిపేట



మల్లారెడ్డిపేట దేవస్థానంలో మాఘ అమావాస్య జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు తగ్గట్టుగా ఆలయంసమీపాన సౌకర్యాలు కల్పించాం. జాతర సందర్భంగా మల్లారెడ్డిపేటకు అదనంగా బస్సు సర్వీస్‌లు పెంచే విధంగా సంబంధిత అధికారులను కోరాం. అంజన్న ఆలయం వచ్చే మార్గాలను భక్తులకు వీలుగా క్లీన్ చేయించి, అన్ని సదుపాయాలు, ఏర్పాటు చేశాం.

జాతర ఏర్పాట్లను పర్యవేక్షించిన రాజన్న ఆలయ ఈవో



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

కోనరావుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిపల్లిలో శుక్రవారం జరిగే మాఘ అమావాస్య జాతరకు ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేములవాడ రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి మామిడిపల్లి సీతారాముల ఆలయ ప్రాంతాన్ని, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మామిడిపల్లి సీతారాముల ఆలయం, నాగారం కోదండరామస్వామి ఆలయం మాఘ అమావాస్య జాతర సందర్భంగా అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. మామిడిపల్లి సీతారాముల స్వామిని సుమారు 50వేల మంది భక్తులు దర్శించుకుంటారని అంచనా వేసి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మందుబాబులకు అడ్డాగా చెరువు కట్ట..



కట్టపై ఖాళీ మద్యం బాటిళ్లు..

ఎల్లారెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ శివారులోని జక్కుల చెరువు కట్ట మందుబాబులకు అడ్డాగా మారింది. మందుబాబులు మద్యం మత్తులో హంగామా సృష్టిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఖాళీ మద్యం సీసాలను కట్టపై ధ్వంసం చేయడం వల్ల ఇబ్బందిగా మారుతోందని వాపోతున్నారు. కట్టపై మద్యం తాగకూడదని మందలిస్తే దాడికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పోలీసులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చెరువు కట్టపై మద్యం తాగుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

● కోనరావుపేట : బీజేవైఎం మండల అధ్యక్షుడిగా జితేందర్‌రెడ్డిని నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన పార్టీ నాయకులకు జితేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో టీటీయూ నూతన క్యాలెండర్‌ను ఎంఈవో మురళి నాయక్ ఆవిష్కరించారు. టీటీయూ నాయకులు రంగారావు, చిరంజీవి, మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు మధుకర్, స్వప్న, నాగరాణి, శ్రీధర్, కృపారాణి, పద్మ, యుగంధర్, మల్లేష్, అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారానికి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఇప్ప మహేష్ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, కొమిరె శంకర్, నవీన్ పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండలంలోని నరసింహులపల్లికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు, ప్యాక్స్ వైస్‌చైర్మన్ బొంగరం శ్రీనివాస్‌రెడ్డి, బొంగరపు జనార్ధన్‌రెడ్డి,రెడ్డిమల్ల నర్సయ్య, కావటి మల్లయ్య, పాతూరి నర్సింహ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవిరెడ్డి, మంద దేవయ్య, పోచయ్య, రాజయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : ఎన్నికల ముందు మోసపూరిత వాగ్దానాలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఒక్క గ్రామానికే భరోసా కల్పించడం సరైనది కాదని బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు బుర్ర సూర్యగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులందరికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

● ఎల్లారెడ్డిపేట : మండలంలోని బొప్పాపూర్‌లో కోతుల బెడదను తీర్చేందుకు తాజా మాజీ సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి మంగళవారం ముందుకు వచ్చారు. స్వంతంగా రూ.4లక్షలు వెచ్చించి కోతులను పట్టేందుకు చర్యలు చేపట్టారు. పలు కాలనీల్లో కోతులను పట్టేవారు జాలీలను ఏర్పాటు చేశారు. సుమారు 100 వానరాలను పట్టి దూర ప్రాంతంలోని అడవుల్లోకి తీసుకెళ్లి వదిలిపెట్టారు.

● కోనరావుపేట : మండలానికి కోటి యాభై లక్షలు మంజూరైనట్లు నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న బ్రిడ్జి రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.